క్లుప్తంగా

జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థులంతా భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో కలసి ఎమ్మెల్యే సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, పెనుమాక జయరాజు, సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురంలో..

తాళ్లపూడి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రారంభించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 180 మందికి భోజనాన్ని అందజేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ గరగా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం తరఫున విద్యార్థులకు స్టీల్ ప్లేట్స్, గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో భక్తి చానల్ ప్రసంగీకుడు పరస రాధాకృష్ణ, టీడీపీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కచ్చా డ్రైన్లు, సీసీ రోడ్ల ప్రారంభం



గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం: నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని, నాలుగు మండలాల అభివృద్ధే ధ్యేయంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా పని చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం గోపాలపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, దొడ్డిగర్ల సువర్ణరాజు, గెల్లా శ్రీనుబాబు, రొంగల సత్యనారాయణ, కొర్లపాటి రాము, జేష్ఠ శ్రీధర్, మద్దిపాటి రమేష్‌చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ వాచర్‌పై దాడి

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట వాటర్ ట్యాంకు వాచర్‌పై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శనివారం దాడి చేశాడు. వివరాల ప్రకారం ట్యాంక్ మంచినీటిని విడుదల చేసే పత్తిపాటి అబ్బులు మోటార్ రిపేరు కావడంతో రెండు గంటల అలస్యంగా మంచినీటిని విడుదల చేశాడు. దీంతో అదే గ్రామానికి చెందిన మల్లిపూడి పెద వీరయ్య ట్యాంకు వాచర్‌తో వాగ్వాదానికి దిగడమే కాకుండా కొట్టాడు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ అబ్బులు నిరసనకు దిగాడు. అతడికి మద్దతుగా సచివాలయంలో పని చేస్తున్న తోటి కాంట్రాక్ట్ ఉద్యోగులు సచివాలయం ముందు నిరసన తెలిపారు. ఈ దాడిపై గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు.

ఇసుక లారీలకు కాటా మినహాయింపు కోరుతూ ధర్నా

- లారీ డ్రైవర్‌పై చేయి చేసుకున్న టోల్‌ప్లాజా సిబ్బంది
- ఆందోళనకు దిగిన లారీ డ్రైవర్లు, ఓనర్లు
- మద్దతు పలికిన బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు



కొవ్వూరు టోల్‌గేట్ కాటా వద్ద ఆందోళన చేస్తున్న లారీ ఓనర్లు, డ్రైవర్లు, బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు

కొవ్వూరు: ఇసుక లారీలకు కాటా నుంచి మినహాయింపు ఇవ్వాలనే డిమాండ్‌తో శనివారం ఇసుక లారీల డ్రైవర్లు, ఓనర్లు ఆందోళనకు దిగారు. పట్టణ శివార్లలోని గామన్ ఇండియా బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద కాటా ఏర్పాటు చేశారు. వాహనాల టోల్ రుసుముతో పాటు కాటాకు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో వెళుతున్న లారీ డ్రైవర్‌తో టోల్‌ప్లాజా సిబ్బంది ఘర్షణ పడి చేయి చేసుకున్నారు. దీంతో లారీ డ్రైవర్లు, ఓనర్లతో పాటు బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులు అక్కడకు చేరుకుని ధర్నాకు దిగారు. సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కూడా అక్కడకు చేరుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తున్నందున ఇసుక లారీలకు కాటా నుంచి మినహాయింపు ఇవ్వాలని లారీ ఓనర్లు కోరారు. కాటా పేరుతో ఇసుకకు అదనంగా వసూలు చేస్తే.. మళ్లీ ఆ భారం వినియోగదారుడిపై పడుతోందని లారీ ఓనర్లు చెప్పారు. కొందరు ఇసుక వినియోగదారులు వేయింగ్ చార్జీలు చెల్లించకపోవడంతో తాము నష్టపోవాల్సి వస్తోందని అన్నారు. టోల్‌ప్లాజా వద్ద ఐదు యూనిట్ల ఇసుక లారీకి రూ.618, ఆరు యూనిట్ల లారీకి రూ.1,236 చొప్పున వేయింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇసుక లోడింగ్ పెరిగే కొద్దీ ఈ రుసుములు కూడా పెంచి వసూలు చేస్తున్నారన్నారు. ర్యాంపుల్లో లోడింగ్‌కు చెల్లించిన సొమ్ముతో పాటు కాటా వద్ద లోడును నుంచి బట్టి రుసుము చెల్లించాల్సి రావడంతో ఇసుకకు అదనపు ఖర్చు తోడవుతోందని, దీనివలన రాజమహేంద్రవరం, విశాఖ వైపు నుంచి వాహనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఈఈ వై.రవీంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించే 2023లో ఇక్కడ కాటా ఏర్పాటు చేశారన్నారు. ఆ జీఓ ప్రకారం అదనపు లోడుకు చెల్లింపులు చేయాలని ఈఈ స్పష్టం చేశారు. అయితే, 20 కిలోమీటర్ల పరిధిలోని వారి వాహనాలకు టోల్‌గేట్ ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. వారు కూడా కనిష్ఠంగా నిర్ణయించిన రుసుము చెల్లించాలని తెలిపారు. ఈ విషయంపై మంత్రి కొల్లు రవీంద్రతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తున్నందున ఇసుక రవాణాకు కాటా నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. గతంలో సీఎం చంద్రబాబు ఇసుక లారీలకు కాటా మినహాయింపు ఇవ్వాలని స్పష్టం చేసినందున దీనికి మంత్రి అంగీకరించారని ఎమ్మెల్యే చెప్పారు. జీఓలోని అంశాలపై, రాష్ట్రంలోని ఇతర టోల్‌గేట్‌ల వద్ద అనుసరిస్తున్న విధానాన్ని పరిశీలిస్తామని అన్నారు. అప్పటి వరకూ ఇసుక లారీల నుంచి కాటా సొమ్ము వసూలు చేయవద్దని సూచించారు.

సంక్షిప్తంగా..

ఐదు వేల మందికి అన్న సమారాధన

పెరవలి: మార్గశిర శనివారం కావడంతో అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. భక్తుల దర్శనానికి గంట సమయం పట్టింది. దాతల ఆర్థిక సహకారంతో సుమారు 5 వేల మంది భక్తులకు అన్న సమారాధన చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలిపారు.

తాడిపర్రు రెవెన్యూ సదస్సులో 26 అర్జీలు

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు సచివాలయం వద్ద శనివారం తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామంలోని రైతుల వద్ద నుంచి 26 అర్జీలు అందాయని ప్రసాద్ తెలిపారు.

తప్పొప్పులను సరి చేయాలి

నిడదవోలు రూరల్: ఎస్సీ కులగణన జాబితాలోని తప్పొప్పులను వెంటనే సరి చేయాలని ఎమ్మార్పీఎస్ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాలింకి రాము కోరారు. శనివారం నిడదవోలు విచ్చేసిన కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ గతంలో చేయించిన కుల గణన ప్రామాణికంగా లేదన్నారు.

పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించాలి

నిడదవోలు రూరల్: పెన్షనర్లకు అవసరమైన సేవలను ట్రెజరీ సిబ్బంది త్వరగా అందించాలని జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.సత్యనారాయణ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నిడదవోలు శాఖ సమావేశాన్ని అధ్యక్షుడు బలగం అప్పారావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యనారాయణ పెన్షనర్ల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నిడదవోలు ట్రెజరీ అధికారి పి.ఫణేంద్ర మాట్లాడుతూ కార్యాలయానికి రాలేని పెన్షనర్ల ఇంటికి వెళ్లి లైఫ్ సర్టిఫికెట్లు తీసుకుంటామన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘాధ్యక్షుడిగా హసన్ జానీ

ఉండ్రాజవరం: పంచాయతీ కార్యదర్శుల సంఘ మండలశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం ఉండ్రాజవరంలో జరిగింది. గౌరవాధ్యక్షుడిగా గంపర్తి వీర వెంకట సత్యనారాయణ (చివటం), అధ్యక్షుడిగా మహ్మద్ హసన్ జానీ (పాలంగి), ఉపాధ్యక్షుడిగా వంగా శ్రీనివాసరావు (కాల్దారి), కార్యదర్శిగా చోళ్ల రాజు (చిలకపాడు), కోశాధికారిగా తిప్పాని రాజకుమార్ (వడ్లూరు), మహిళా సంయుక్త కార్యదర్శిగా తెల్లం బాలత్రిపుర సుందరి (మోర్త) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గర్భిణులకు ఆకుకూరల పంపిణీ

దేవరపల్లి: స్థానిక నిమ్మలపాటి వీధిలో గల పోషక వాటికలను శనివారం ఐసీడీఎస్ పీడీ విజయకుమారి సందర్శించారు. ఇక్కడ పండిస్తున్న వివిధ రకాల ఆకురూరలను ఆమె పరిశీలించారు. ఆ ప్రాంతంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులకు ఆకుకూరలను అందజేశారు. గోపాలపురం సీడీపీఓ నాగలక్ష్మి, సూపర్‌వైజర్లు శశికళ, విజయశాంతి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా ప్రమోద్‌కుమార్

నిడదవోలు: బీజేపీ నిడదవోలు పట్టణ శాఖ అధ్యక్షుడిగా మోర్త ప్రమోద్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆయనను బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: కృష్ణంపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. కృష్ణంపాలెం, యర్నగూడెం, సంగాయగూడెం, ధుమంతునిగూడెం, పల్లంట్ల ఫీడర్లపై గల గృహ, వాణిజ్య, వ్యవసాయ సర్వీసులకు సరఫరా ఉండదన్నారు.

53 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల భేటీ



గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1971-72 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

గోపాలపురం: ఒకే గదిలో పక్కపక్కనే కూర్చుని పాఠాలు వల్లె వేసిన వారంతా ఐదు దశాబ్దాల తర్వాత, వృద్ధాప్యంలో కలుసుకుని సందడి చేశారు. గోపాలపురం జిల్లా పరిషత్ హైస్కూల్ 1971–72 బ్యాచ్ టెన్త్ విద్యార్థులులు శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో కలుసుకున్నారు. సుమారు 53 సంవత్సరాల తర్వాత కలుసుకున్న ఆ పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాతలు, అమ్మమ్మలు అయినా సరే ఇప్పటికీ తమ పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం అప్పట్లో తమకు విద్యను అందించిన ఉపాధ్యాయులను స్మరించుకొని స్వర్గీయులైన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. తమతో చదువుకుని స్వర్గస్తులైన సహచర విద్యార్థులకు నివాళులు అర్పించారు.

పాల సంఘాధ్యక్షుడు 'అల్లూరి'కి సన్మానం

నల్లజర్ల: పుల్లలపాడు పాలఉత్పత్తిదారుల సంఘానికి 25 ఏళ్లగా అధ్యక్షుడిగా పని చేస్తున్న అల్లూరి దుర్గారావును ఆ పాల కేంద్రం వద్ద శనివారం ఘనంగా సన్మానించారు.ముఖ్య అతిథిగా హాజరైన విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు దుర్గారావును శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆంజనేయులు, విజయ డెయిరీ నల్లజర్ల మేనేజరు మూర్తి తమ ప్రసంగాల్లో డెయిరీ అభివృద్ధికి దుర్గారావు జరిపిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాడిరైతుల సంఘ గౌరవాధ్యక్షుడు ఘంటా నాగేశ్వరరావు, సర్పంచ్ నందమూరి శారదాదేవి, రామకృష్ణ, యలమాటి ఆనంద్, మద్దిపాటి దుర్గారావు, పెండ్యాల వీరరాఘవులు, వేగి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణ ధర పెంపు

లీటరు పాలధరను 10 శాతం వెన్నపై రూ.80 నుంచి రూ.82కు పెంచి కొనుగోలు చేస్తున్నట్టు విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు వెల్లడించారు. శనివారం పుల్లలపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆవు పాలు టోటల్ సోలిడ్స్‌పై రూ.280 నుంచి రూ.10 పెంచి రూ.290కి పెంచామన్నారు.

కొత్త రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్ జారీ

తాళ్లపూడి: మండలంలోని కొత్తగా 11 రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు తహసీల్దార్ కార్యాలయ సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ దివాకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రక్కిలంక షాప్ నంబర్- 1 (ఓసీ), పైడిమెట్ట- 2 (బీసీ- ఎ), గజ్జరం- 7 (ఓసీ మహిళ), సూరయ్యపేట- 9 (ఓసీ), తాళ్లపూడి -11 (ఓసీ మహిళ), వేగేశ్వరపురం -14 (ఎస్సీ), వేగేశ్వరపురం షాపు నంబర్ 32 (ఓసీ మహిళ), పెద్దేవం- 18 (బీసీ- బి మహిళ), తిరుగుడుమెట్ట -26 (ఓసీ), మలకపల్లి- 22 (బీసీ- బీ మహిళ), అన్నదేవరపేట -29 (దివ్యాంగ మహిళ)కు, కేటాయించామని ఆయన వివరించారు. ఆసక్తి గల అర్హులు ఈ నెల 10 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సుబ్బరాయపురంలో మూడిళ్లు దగ్ధం



సుబ్బరాయపురంలో అగ్నిప్రమాదంలో దగ్ధమైన తాటాకిళ్లు

దేవరపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మండలంలోని ధుమంతునిగూడెం శివారు సుబ్బరాయపురంలో శనివారం మూడు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. మూడు నిరుపేద కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. ఇళ్లలో ఎవరూ లేని మధ్యాహ్నం వేళ ఈ అగ్ని ప్రమాదం జరిగింది. చాపల చంద్రమ్మ, మందా నిర్మల, మందా రామారావులకు చెందిన మూడిళ్లు ఈ ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. కొవ్వూరు అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు వీఆర్వో ఎస్‌కే బాషా తెలిపారు. తొలుత చంద్రమ్మ ఇంటిలో మంటలు వ్యాపించి, పక్కనే గల నిర్మల, రామారావులకు చెందిన ఇళ్లు కాలిపోయినట్టు ఆయన తెలిపారు.

విద్య, వాణిజ్య కేంద్రంగా తాళ్లపూడి



తాళ్లపూడి: పచ్చటి పంట పొలాలు, పాడి పంటలు, గోదావరి జలాల పరవళ్లతో కళకళలాడే తాళ్లపూడి విద్యా కేంద్రంగా కూడా అభివృద్ధి చెందుతోంది. ఎల్‌కేజీ నుంచి ఉన్నత స్థాయి విద్య వరకూ అందించే పలు విద్యాసంస్థలు తాళ్లపూడిలో ఉన్నాయి. అటు పోలవరం, ఇటు గోపాలపురం తదితర మండలాలకు తాళ్లపూడి ప్రధాన కేంద్రంగా మారింది. తాళ్లపూడిలో నిర్వహిస్తున్న బీఈడీ, డీఈడీ కోర్సుల్లో చేరేందుకు ఇతర జిల్లాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడకు వస్తున్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలు సైతం తాళ్లపూడిలో అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి ఒకేషనల్ జూనియర్ కళాశాల్లో నర్సింగ్, పలు ఒకేషనల్ కోర్సులు, వృత్తి విద్యాకోర్సుల్లో అనేక మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. వేగేశ్వరపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. మండలంలో ఆరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 30 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 14 ప్రైవేట్ పాఠశాలలు వేలాది మందికి విద్య అందిస్తున్నాయి. నూరు శాతం ఉత్తీర్ణత సాధనలో ఈ విద్యాలయాలు కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీ పడుతున్నాయి. గతంతో పోలిస్తే విద్యాపరంగా సదుపాయాలు బాగా మెరుగ్గా ఉండడంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు సైతం తమ పిల్లలను ప్రైవేట్ కాన్వెంట్లల్లోను, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ వైద్య సేవలు

వైద్య, వ్యాపార పరంగా కూడా తాళ్లపూడి పురోగమిస్తోంది. ఇక్కడ పలు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు అందుబాటులో ఉన్నాయి. పిల్లలు, డెంటల్ విభాగంలో కూడా మెరుగైన వైద్యం లభిస్తోంది. ఇక వస్త్ర దుకాణాలకు, కిరాణా, జ్యూయలరీ, ఆటోమొబైల్స్ షాపులకు తాళ్లపూడి పెట్టింది పేరు. పరిసర గ్రామాల నుంచి వచ్చిపోయే కష్టమర్లతో తాళ్లపూడిలోని హోటళ్లు రద్దీగా ఉంటాయి. పదుల సంఖ్యలో రైస్ మిల్లులు ఉండడంతో వందలాది జట్టు కార్మికులకు ఉపాధి దొరుకుతోంది. ఇటీవల అన్నదేవరపేట, మండల పరిసర ప్రాంతాల్లో పలు భారీ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. వందలాది మంది నిరుద్యోగులకు వాటిలో ఉపాధి లభించింది. తాళ్లపూడిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా పెరిగింది. అన్ని సౌకర్యాలూ లభిస్తుండడంతో ఇక్కడ ఇళ్లు కట్టుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు.